
సాక్షి
బాపట్ల
ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



ప్రద్యుమ్న రక్తదానం


లబ్బీపేట(విజయవాడ): రాష్ట్ర రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న శనివారం రక్తదానం చేశారు. విజయవాడ గాంధీనగర్‌లోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకును సందర్శించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 505.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.6200, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయండి

వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌ రెడ్డి ఈ నెల 29వ తేదీన పొన్నూరులో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారని, సభలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ కోరారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని పార్టీ కార్యాలయంలో శనివారం అన్ని గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ 29వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు పొన్నూరు అంబేడ్కర్ సెంటర్‌లో జరిగే సభకు చేబ్రోలు మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో ద్వారా రానున్న ఐదేళ్ల కాలంలో ప్రతి ఒక్కరి జీవితం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల విధులు

గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



గుంటూరు వెస్ట్: త్వరలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల విధులు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు నీరజ్ కుమార్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ఐసీ ద్వారా రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 13,800 మంది సిబ్బందిని నియమించామన్నారు. కేంద్ర బలగాలు కాకుండా 2300 పీఓలు, 2300 ఏపీఓలు, ఓపీఓలుగా 9200 మందిని నియమించామన్నారు. అధికారులు, సిబ్బంది పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జేసీ జి.రాజకుమారి, ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్ఓ పెద్ది రోజా, ఎన్ఐసీ డీఐఓ బిమల్ కుమార్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి నూజివీడుకు చెందిన భక్తులు రూ. లక్ష విరాళాన్ని శనివారం అందజేశారు. నూజివీడుకు చెందిన ఎస్‌వీపీఎస్ ఎంటర్‌ప్రైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన లక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి కుటుంబం ఆలయ అధికారులను కలిసి రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఏఈవో ఎస్.రమేష్‌బాబు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

బంగారు తాపడం పనులకు విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు శనివారం పలువురు భక్తులు విరాళాలను అందజేశారు. విజయవాడకు చెందిన టి. సత్యసాయిబాబారెడ్డి రూ. 1,01,116, హనుమంతు రాజేశ్వరరావు స్వప్న దంపతులు రూ. 1,01,116, బండి కళావతి ఆంజనేయులు రూ. 1,00,116 విరాళాలను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

జగనన్న సంక్షేమ సంతకం



మేనిఫెస్టో అంటే పార్టీ ఆశయాలు, ఆదర్శాలకు నిర్వచనం. ప్రజా సంక్షేమానికి, ప్రగతి పథానికి అక్షర రూపం. దాన్ని పవిత్ర గ్రంథంలా భావించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని 99 శాతం పైగా అమలు చేశారు. చెప్పాడంటే..చేస్తాడంటూ అనే మాటను అక్షరాలా రుజువు చేశారు. ప్రజలంతా సంక్షేమ వరాల జల్లులో తడిసిపోయారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి రాచబాట పట్టింది. నాడు–నేడుతో ప్రభుత్వ బడులు గుడుల్లా మారాయి. జగనన్న సురక్షతో వైద్యం ఇంటి బాట పట్టింది. రైతు భరోసా కేంద్రాలతో వ్యవసాయం పండుగలా మారింది. బిడ్డ చదువుకు అమ్మఒడి సాయం అందింది. అదే సంక్షేమాన్ని ఆలంబనగా చేసుకుని, అదే ఉత్సాహంతో, అదే ధైర్యంలో నేడు మేనిఫెస్టోను విడుదల చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా నవరత్నాలకు మెరుగులు దిద్ది రాష్ట్రంపై చెరగని సంక్షేమ సంతకం చేశారు.

జగనన్న మేనిఫెస్టో జనరంజకం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

నగరం: రాష్ట్రాభివృద్ధితో పాటు పేదల ఆర్థికస్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో జనరంజకంగా ఉందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోను నూరుశాతం తూచా తప్పకుండా అమలుచేసిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఏ ఒక్కరాజకీయ పార్టీ కూడా ఇచ్చిన మేనిఫెస్టోను అమలు చేసిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. 2019లో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్ని అమలు చేయడంతో పాటు రాష్ట్ర ప్రజల సంక్షేమానికి అనుగుణంగా మరికొన్ని పథకాలను రూపొందించి అమలు చేసింది జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వివరించారు. 2014 ఎన్నికల్లో అమలు చేయలేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీలను తుంగలోకి తొక్కి రాష్ట్ర ప్రజానీకాన్ని మోసం చేశారని విమర్శించారు. మేనిఫెస్టోను పవిత్రమైన భగవద్గీత, ఖురాన్, బైబులుగా భావించి తూచా తప్పకుండా అమలు చేసే జగనన్న హామీల్ని ప్రజలు పూర్తిగా నమ్ముతారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు కూటమిని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి జనరంజక పాలన అందించిన జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, నాయకులు చందోలు దేవదాసు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట



వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో ఆశాజనకంగా ఉంది. సీఎం జగన్‌మోహనరెడ్డి మళ్లీ పేదవారికి పెద్దపీట వేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆయన ప్రవేశపెట్టిన కాపు నేస్తం పథకం ద్వారా కాపులు విశ్వాసంతో ఉన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి ఆశయాలు, భావాలతో జగన్‌మోహనరెడ్డి ఆలోచనా విధానం మరువలేనిది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ మళ్లీ రావాలి. మాట ఇస్తే మడమ తిప్పని జగనన్న మాట ప్రజలు నమ్మారు. చంద్రబాబునాయుడు మాటల్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. 15 ఏళ్లగా గుర్తుకు రాని మూడు సిలిండర్ల పంపిణీ, జగన్‌మోహనరెడ్డి సంక్షేమ పథకాలు అమలు తీరుతో ఇప్పుడు గుర్తుకు రావడాన్ని ప్రజలు గుర్తించాలి. బీజేపీతో పొత్తు పెట్టుకోక ముందు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేశారో లేదో ఆయన ప్రజలకు చెప్పాల్సి ఉంది. ముస్లిం మైనార్టీల నాలుగు శాతం రిజర్వేషన్‌ను కొనసాగిస్తున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే.

యడం బాలాజీ, పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి

చంద్రబాబులా మోసాల చిట్టా కాదు



మేనిఫెస్టోని విడుదల చేసి చివరకు దాన్ని ఆన్‌లైన్‌లో లేకుండానే తొలగించిన ఘనత దేశ చరిత్రలో చంద్రబాబుకే దక్కింది. అన్న మాట చేసి చూపించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో అబద్ధాలు, మోసాలకు విరుద్ధంగా ఉంది. మహిళలు, వృద్ధులతో పాటు నిరుద్యోగ యువతకు పెద్దపీట వేశారు. మేనిఫెస్టోని భగవద్గీత, ఖురాన్, బైబిల్ మాదిరిగా భావించే ఆయన అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పించారు. పింఛన్ పెంపుదల, విద్యాభివృద్ధికి అమ్మఒడి, ఆరోగ్యశ్రీ పెంపుదల, పొదుపు మహిళలకు ఆర్థిక సుస్థిరత కల్పించేలా మేనిఫెస్టో తయారు చేయడం గొప్ప విషయం.

కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే, చీరాల

బాబు 'సూపర్ సిక్స్' పెద్ద మోసం

అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి



అద్దంకి రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో అన్ని వర్గాల వారిని సంతృప్తి పరిచిందని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేనిఫెస్టోను బైబిల్‌గా, ఖురాన్‌గా, భగవద్గీతగా ముఖ్యమంత్రి భావిస్తారని తెలిపారు. 2019 మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నవరత్నాలతో 99 శాతం అమలు పరిచారని పేర్కొన్నారు. మోసం చేయడమే పనిగా పెట్టుకుని అమలు సాధ్యంకాని టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు నమ్మే పరిస్థితులు లేవని తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటం చంద్రబాబు రక్తంలో లేదన్నారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు మేలు



సీఎం జగనన్న ప్రవేశపెట్టిన 2024 మేనిఫెస్టో అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉంది. వ్యవసాయ రంగం, ఉపాధి అవకాశాలు, మహిళల ఆర్థికాభివృద్ధి, విద్యాభివృద్ధి, అవ్వాతాతలు, వితంతువులను పింఛన్ పెంపుదలతో తోడ్పాటు లభిస్తుంది. చేయూత, చేదోడు, గతంలో ఉన్న అన్నీ పథకాలు మళ్లీ కొనసాగేలా మేనిఫెస్టో రూపొందించడం చారిత్రాత్మకం. పేదలందరికీ మేలు చేసే మేనిఫెస్టో ఇదీ.

కరణం వెంకటేష్, చీరాల అసెంబ్లీ అభ్యర్థి

చంద్రబాబు మేనిఫెస్టో పెద్ద మోసం



చంద్రబాబు లాగా మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేజిక్కించుకోవాలంటే వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడో వచ్చేవారు. ఆయన అలాంటి హామీలు ఇవ్వరు. ఇస్తే నెరవేర్చే వరకు నిద్రపోరు. రాష్ట్ర ఆదాయానికి మించి చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు ఉన్నాయి. జగనన్న పథకాల వ్యయం ఆదాయానికి లోబడి ఉంది. చంద్రబాబు అదనంగా అవసరమైన రూ.45 వేల కోట్లు ఎక్కడ నుంచి తెస్తాడు? అందుకే ఆయన్ను, ఆయన సూపర్ సిక్స్‌ను ఎవరూ నమ్మరు.

– చౌదరి బాబు, గోపాలపురం, అద్దంకి

విద్య, వైద్యంతో పాటు రైతన్నలకు పెద్దపీట



మళ్లీ మేం అధికారంలోకి వస్తే విద్య, వైద్యంతో పాటు, రైతన్నలకు మేలు చేస్తామని జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టో అద్భుతం. యువతకు ఉపాధి, విద్యా రంగంలో పెను విప్లవాత్మక మార్పులు, ఆరోగ్యశ్రీతో ఉచిత వైద్యం, రైతులకు రైతు భరోసాను రూ.16 వేలకు పెంపు వంటి అనేక హామీల్ని మేము నమ్ముతున్నాం. ఆయనకే మా ఓటు వేసి గెలిపిస్తాం. ఇచ్చిన హామీల్ని తిరిగి పొందుతాం. ఇలాంటి నాయకుడిని మా జీవితంలో చూడలేదు.

–యార్లగడ్డ శ్రీకాంత్, కారంచేడు

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంకండి!

ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్



కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పరిమళ సింగ్

బాపట్ల: సార్వత్రిక ఎన్నికలు పారదర్శకతతో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, ఎస్పీ, రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం అయ్యారు. ముందుగా బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్, ఎస్పీతో కలిసి పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు మే 13న సమర్థంగా నిర్వహించడానికి అధికారులంతా సంసిద్ధం కావాలని పరిమళ సింగ్ తెలిపారు. ఎన్నికల సమయంలో సమస్యలు ఉత్పన్నం కాకుండా విధులు నిర్వహించే అధికారులకు శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలను అనుసరించి ప్రతి కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అధికారులు పొరపాట్లు చేయకుండా ఉన్నతాధికారులతో చర్చించి, సందేహాలు నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈవీఎం యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరపడానికి అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు నిరంతరం తనిఖీ చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు వేసుకునేలా చూడాలని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎన్నికల పరిశీలకులకు వివరించారు. ఎన్నికల సామగ్రిని ప్రతి నియోజకవర్గంలో సమకూర్చామని తెలిపారు. జిల్లాలో తుది ఓటర్ల జాబితా ప్రచురణ, పోలింగ్ కేంద్రాలు, అధికారులు, ఉద్యోగుల నియామకం, కంట్రోల్ రూం, నోడల్ ఆఫీసర్లు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీంలు పనితీరుపై పీపీటీ ద్వారా వివరించారు. అనంతరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ భద్రత అంశాలపై సిద్ధం చేసిన నివేదికను చదివి వినిపించారు. సమావేశంలో జిల్లాకు వచ్చిన సాధారణ పరిశీలకులు కాజన్ సింగ్, పోలీస్ పరిశీలకులు అయ్యప్ప, ఎక్స్‌పెండిచర్ పరిశీలకులు అనహయ్య, స్వప్నిల్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, ఆర్‌ఓలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

దేవాంగులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి



దేశాయిపేటలో దేవాంగ గ్రామ సేనాధిపతులతో ఎమ్మెల్యే కరణం

వేటపాలెం: నియోజకవర్గంలో దేవాంగ సామాజికవర్గానికి ఎప్పుడూ అండగా ఉంటామని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని పందిళ్లపల్లి, రామన్నపేట, రావూరిపేట, దేశాయిపేట, ఆణుమల్లిపేట, నీలకంఠాపురం, దంతంపేట, రామానగర్ ప్రాంతాల్లో శనివారం గ్రామ దేవాంగ సేనాధిపతులతో ఆయన సమావేశమయ్యారు. ముందుగా రావూరిపేట శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ ప్రభుత్వం చేనేతలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తు చేశారు. నేతన్న నేస్తం పథకం కింద ప్రతి ఏడాది రూ. 24 వేలు ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. తిరిగి జగన్ అధికారంలో తెచ్చుకొంటే పథకం కొనసాగించడంతో పాటు ఇంకా ఎక్కువగా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఇచ్చిన మాట తప్పకుండా పథకాలన్నీ అమలు చేసిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. కరోనా సమయంలో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారని తెలిపారు. ఎన్నికలు దగ్గరపడుతున్నందున ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు హామీలు గుప్పిస్తున్నాయని, ఇవన్నీ కూడా ఓట్లు దండుకోవడానికి మాత్రమేనని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. గతంలో నాయకులు పాలనలలో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని, అటువంటి వాళ్లు ఇప్పుడు నీతులు చెబుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని పేర్కొన్నారు. మంచి జరిగితేనే తనకు ఓట్లు వేయాలని కోరారు. కరణం వెంకటేష్‌కు, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌కు ఫ్యాన్‌పై బటన్ నొక్కి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, మాజీ ఎంపీపీ చల్లా జనార్దన్, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ లేళ్ల శ్రీధర్, కర్ణ లక్ష్మారావు, బీరక పరమేష్ పాల్గొన్నారు.

జిల్లాలో 35 మోడల్ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు

నోడల్ అధికారి వై. పిచ్చిరెడ్డి



పెరవలిలో మోడల్ పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న నోడల్ అధికారి పిచ్చిరెడ్డి

పెరవలి(వేమూరు): బాపట్ల జిల్లాలో 35 మోడల్ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా ఎన్నికల నోడల్ అధికారి వై. పిచ్చిరెడ్డి తెలిపారు. మండలంలోని పెరవలిలో మోడల్ పోలింగ్ బూత్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలకు కమిషన్ ఆదేశాల మేరకు కొన్నిచోట్ల మోడల్ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేమూరు నియోజక వర్గంలో ఐదు, చుండూరు మండలం యడ్లపల్లిలో ఆలపాటి వెంకటరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, అమర్తలూరు మండలం పెదపూడిలోని ప్రైమరీ మండల పరిషత్ ఉన్నత పాఠశాల నార్త్, పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మోడల్ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొల్లూరు మండల పరిషత్ ప్రైమరీ బీఎఫ్ఎస్ పాఠశాల, భట్టిప్రోలు మండలం గుత్తివారిపాలెంలోని నాదెండ్ల సుబ్బయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల కమిషన్ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- శరవేగంగా స్పందించేందుకు అందుబాటులో సమర్థ్ మొబైల్ యాప్



ఎస్పీ కార్యాలయంలో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఆయన జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల వేళ ఏదైనా అవాంఛనీయ ఘటన సంభవిస్తే జిల్లా పోలీస్ శాఖ వేగంగా స్పందించి సమర్థంగా విధులు నిర్వహించడానికి సమర్థ్ మొబైల్ యాప్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాల లొకేషన్లను ఎంతో సులభంగా గుర్తించవచ్చని చెప్పారు. మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ బృందాలను తక్షణమే పంపించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. కంట్రోల్ రూం నుంచిపి లీస్ బలగాల లొకేషన్లు గూగుల్ మ్యాప్ ద్వారా ట్రాక్ చేయవచ్చని తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది యాప్‌పై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. గతంలో నేరాలకు పాల్పడిన ప్రతి ఒక్కరినీ బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను సమర్థంగా అరికట్టడానికి చెక్‌పోస్ట్‌ల వద్ద ఎస్ఎస్‌టీ బృందాలు అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. వీడియో కాన్ఫిరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, డీఎస్పీ క్రైం పి.జగదీష్ నాయక్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అమెరికా యూనివర్సిటీ అధ్యక్షుడిగా విద్యార్థి రోహిత్ సాయి



జే.పంగులూరు: అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మసాచూసెట్ లోవెల్స్‌కి సంబంధించిన ఇండియన్ స్టూడెంట్స్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో బాపట్ల జిల్లా పంగులూరు గ్రామానికి చెందిన రోహిత్ సాయి అధ్యక్షుడిగా ఘనవిజయం సాధించాడు. ప్రస్తుతం ఎంఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 26న జరిగిన ఎన్నికల్లో 76 శాతం ఓట్లతో ప్రత్యర్థిపై ఘనవిజయం సాధించాడు. రోహిత్ తండ్రి బాచిన హనుమంతరావు కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా ఏపీ హైకోర్టులో విధులు నిర్వర్తిస్తున్నారు. రోహిత్ ఎన్నికపై పంగులూరు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఆమంచి నామినేషన్ ఆమోదం

చీరాల: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణ మోహన్ దాఖలు చేసిన నామినేషన్ ను అధికారులు ఎట్టకేలకు శనివారం ఆమోదించారు. ఎన్నికల అఫిడవిట్‌లో తప్పులు ఉన్నాయంటూ వచ్చిన అభ్యంతరాలపై క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదముద్రవేశారు. పరిశీలన ప్రక్రియలో ఆమంచి వెంట పార్లమెంట్ అభ్యర్థి జేడీ శీలం, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ



పిట్టలవానిపాలెం: చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ టీపీ.విఠేశ్వర్ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా.. అల్లూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, రైతు భరోసా కేంద్రం, ఖాజీపాలెం ఎంపీయూపీ స్కూలు, పిట్టువారిపాలెం యూపీ స్కూలు ఆవరణలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. గతంలో జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్‌రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జాగ్రత్త పడాలని అధికారులకు సూచించారు. భద్రతా చర్యలు, బారికేడ్లు, క్యూ లైన్ల ఏర్పాటు పై మార్గనిర్దేశనం చేశారు. ఆయన వెంట బాపట్ల డీఎస్పీ మురళీ కృష్ణ, చందోలు ఎస్ఐ అనిల్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

ఏబీఆర్ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా



రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రి కళాశాలకు అరుదైన గౌరవం దక్కింది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి స్వయం ప్రతిపత్తి హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు అందాయి. 2024–25 విద్యాసంవత్సరం నుంచి పదేళ్ల పాటు హోదా కొనసాగుతుంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ టీపీ రవిచంద్ర కుమార్ వివరాలు వెల్లడించారు. కళాశాలకు స్వయం ప్రతిపత్తి లభించటంతో అనేక ప్రయోజనాలు సమకూరుతాయన్నారు. యూనివర్శిటీ అనుమతులు లేకుండా కావాల్సిన కోర్సులను కళాశాలలో అమలుపరుచుకోవచ్చన్నారు. పరీక్షలకు అవసరమైన ప్రశ్నాపత్రాల తయారీ, పరీక్షా జవాబు పత్రాల మూల్యాంకన, ఫలితాల వెల్లడి, యూనివర్శిటీ స్థాయిలో జరిగే కార్యకలాపాలు కళాశాలలోనే నిర్వహించుకునే అధికారం లభించిందన్నారు.

కార్యకర్తలు కదం తొక్కాలి

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పిలుపు
- మోపిదేవి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలకు ఆకర్షితులై పట్టణంలోని 23వ వార్డుకు చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈమేరకు తన క్యాంప్ కార్యాలయంలో ఎంపీ మోపిదేవి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలో నాయకులు, కార్యకర్తలకు సముచితస్థానం లభిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. వార్డు ఇన్‌చార్జి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉప్పూరెట్ల జాలయ్య, షేక్ గౌస్, బొమ్మిడి రాజేష్, బొమ్మిడి సాయిరాం, గున్నం గోపీ, గున్నం సాయి, మార్ల గోపీ, దాసరి సునీల్, దాసరి ఆకాష్, కై తేపల్లి శ్రీహరి, పునుగు గోపీ శివయ్య పార్టీలో చేరినవారిలో ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు

మాదిగలకు ప్రాధాన్యమిచ్చింది జగనన్నే

- కరణంతో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు భేటీ
- మాదిగలంతా సహకరిస్తామంటూ హామీ

చీరాల: మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి ప్రత్యేకంగా మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. శనివారం చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్ ను రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం బ్రహ్మయ్యమాదిగ మాట్లాడుతూ సీఎం జగన్ మాదిగలకు చట్టసభల్లో ఎనలేని ప్రాధాన్యమిచ్చారన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించిన ఆయనకు మాదిగలు రుణపడి ఉంటారన్నారు. వచ్చే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేశ్ విజయానికి మాదిగలంతా పూర్తి సహకారం అందిస్తారని ఆయన అన్నారు.



చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బ్రహ్మయ్య మాదిగ

అరటి పళ్ల దుకాణాల్లో తనిఖీలు

చీరాల అర్బన్: చీరాల పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో అరటి పండ్ల దుకాణాలపై జిల్లా ఆహార భద్రతా అధికారులు తనిఖీలు నిర్వహించారు. అరటి పండ్ల నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. ఈ సందర్భంగా జిల్లా ఆహార భద్రత అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ అరటి పండ్లు తొందరగా పండేందుకు వ్యాపారులు రసాయనాలు ఉపయోగిస్తున్నారన్నారు. హానికరమైన రసాయనాలను వినియోగిస్తూ తాజా పండ్ల పేరుతో వ్యాపారం చేస్తున్న తీరును ప్రత్యక్షంగా చూశామన్నారు. ఇలాంటి పళ్లను తింటే అనారోగ్యానికి గురవుతామన్నారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా రసాయనాలను వినియోగిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, సిబ్బంది పాల్గొన్నారు.



అరటి పండ్లను పరిశీలిస్తున్న జిల్లా ఆహార భద్రత అధికారి ప్రభాకరరావు

అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌కు సీఎం వైఎస్ జగన్ కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ గతేడాది జూన్ 7వ తేదీన కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వుల్లో భాగంగా 3,545 మంది కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించేందుకు నిర్ణయించారని పేర్కొన్నారు. అయితే వివిధ శాఖల్లో క్రమబద్ధీకరణ జరుగగా, ఒక్క విద్యాశాఖలోనే ఉన్నతాధికారుల వైఖరితో కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ నిలిచిపోయిందన్నారు. గత మార్చి నెలలో వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించిన అధికారులు, విద్యాశాఖలో ఇందుకు విరుద్ధంగా వ్యవహరించారని తెలిపారు. వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి, న్యాయం చేస్తామని తమకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఇచ్చారని తెలిపారు.

ఫ్యాన్ గాలికి ప్రత్యర్థులు గల్లంతవ్వాలి

- ప్రజలకు పిలుపునిచ్చిన కరణం వెంకటేశ్
- సతీమణి గీత, సోదరి సుధారాణితో ఎన్నికల ప్రచారం

చీరాల టౌన్: చీరాలలో ఫ్యాన్ గాలికి ప్రత్యర్థులు గల్లంతవ్వాలని స్థానిక అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్ ప్రజలకు పిలుపునిచ్చారు. 2019–2024 మధ్య కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ మోహన్‌రెడ్డే నని అన్నారు. తన సతీమణి గీత, సోదరి గోరంట్ల సుధారాణితో కలిసి రామకృష్ణాపురం, ఈపురుపాలెంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో చీరాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపామన్నారు. నవరత్నాల పథకాలను మళ్లీ రాబోయే రోజుల్లో మరింతగా అందించనున్నామని ఓటర్లకు వివరించారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రామకృష్ణాపురం, ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులన పూర్తితో , మౌలిక వసతులు కల్పించి ఇచ్చిన హామీలు నెరవేర్చామన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే చీరాలను ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుతానన్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల అభ్యున్నతి, అభివృద్ధికి అండగా నిలిచామన్నారు. ప్రతిపక్షాల అబద్ధపు హామీలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. వచ్చేనెల 13న జరగనున్న ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, పార్లమెంట్ అభ్యర్థి ఎంపీ నందిగం సురేశ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాల రు. ప్రచార కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, దామెర్ల శ్రీకృష్ణ, ముట్టే శేషులు, జీ సుధాకర్, ఆంజనేయులు, మాధవ, రాఘవ, వాసిమళ్ల సోదరులు, గుంటూరు మాధవరావు, క్లస్టర్–2 మహిళా అధ్యక్షురాలు గోలి స్వాతి, కో–ఆప్షన్ సభ్యురాలు కోడూరి నాగజ్యోతి, షేక్ ఫాతిమా, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు అంకాళరెడ్డి, రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ మల్లెల లలిత, కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.వైష్ణవి, దివి జయరావ్, వార్డు కౌన్సిలర్లు పార్టీ నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



రామకృష్ణాపురంలో ఎన్నికల ప్రచారంలో కరణం వెంకటేశ్, గీత, సుధారాణి



వృద్ధురాలిని ఆప్యాయంగా ఓటు కోరుతున్న వెంకటేశ్

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

జనరల్ అబ్జర్వర్ భూరే సర్వేశ్వర్ నరేందర్



మాచర్ల రూరల్: పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలైన మంచినీరు, టెంట్‌తో పాటు విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు ఓటర్లకు ప్రశాంతమైన వాతావరణాన్ని అందించటంలో అధికారులంతా సమిష్టిగా పని చేయాలని జనరల్ అబ్జర్వర్ భూరే సర్వేశ్వర్ నరేందర్, జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్ కోరారు. శనివారం మండలంలోని కంభంపాడు, రాయవరం గ్రామాలలోని జెడ్పీహెచ్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసే ఓటర్లతో పాటు ముఖ్యంగా సిబ్బందికి మౌలిక వసతులను కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ప్రజలకు ఓటింగ్ పై అవగాహన కల్పిస్తూ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించి అక్కడ సిబ్బందితో చర్చించారు. పోలింగ్ సిబ్బందికి ఇబ్బంది లేకుండా సకాలంలో వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ మంజునాథరెడ్డి, మున్సిపల్ కమీషనర్ వెంకట్‌దాసు, డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్ శర్మ, షేక్ బాషా తదితరులున్నారు.

వంగవీటి రంగాను హత్య చేసిన పార్టీకి ఓట్లేస్తారా?

వరికూటి అశోక్ బాబు

చదలవాడ(వేమూరు) వంగ వీటి రంగాను అతి దారుణంగా హత్య చేయించిన తెలుగు దేశం పార్టీకి కాపులు ఓట్లు వేస్తారా అని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. వేమూరు మండలం చదలవాడలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో విద్య, వైద్యా రంగానికి అధిక ప్రాధాన్యం కల్పించారన్నారు.వైఎస్సార్ కాపు నేస్తం , అమ్మఒడి, చేయూత పథకాల పరిధితో పాటు రైతు భరోసా కూడా పెంచారన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు నవరత్నాల్లో భాగంగా మహిళల అకౌంట్‌లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో చందోలు డేవిడ్ విజయకుమార్, గ్రామ సర్పంచ్ దాసరి రమేశ్, బొల్లిముంత ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షులు తాడి కొండ శ్రీనుబాబు, కొక్కిల గడ్డ రూఫస్ పాల్, బొల్లిముంత వెంకయ్యమ్మ, అత్తోట ప్రభాకరావు, కసుకుర్తి దాసు, .జి బాబురావు, గొడుకు మోహన రావు, చాట్రగడ్డ మల్లికార్జునరావు, బొల్లెదు కిరణ్, సందీప్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



చదలవాడలో ఎన్నికల ప్రచారంలో అశోక్‌బాబు

వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

యడ్లపాడు: వేసవి సెలవుల్ని విద్యార్థులు తమ విలువైన కాలాన్ని వృధా చేసుకోకుండా జీవన నైపుణ్యాల మెరుగుకు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని తెలిపారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు ప్రభుత్వం ప్రకటించిన వేసవి సెలవుల్లో ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో 1–10వ తరగతి విద్యార్థులు పలు కృత్యాలు చేసే విధంగా షెడ్యూల్‌ను రూపొందించింది. ఇందులో భాగంగా విద్యార్థులు శారీరక, మానసిక వ్యాయామం కోసం స్పోర్ట్ అండ్ గేమ్స్ యాక్టివిటీస్, అలాగే ఉయ్ లవ్ రీడింగ్ ద్వారా పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందుతుందన్నారు. ఆయా కార్యక్రమాలను ఉమ్మడి జిల్లాను గుంటూరు, తెనాలి డివిజన్లను విభజించి వీటిపై అన్ని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అవగాహన కల్పించామన్నారు. ఆయా కార్యక్రమాల్లో తమ పిల్లలు పాల్గొనేలా పేరెంట్స్ బాధ్యత తీసుకోవాలని సూచించారు. డాన్స్, డ్రామా, మ్యూజిక్ వంటి అంశాల్లో తమ పిల్లలు ప్రదర్శించిన ఫోటోలను వాట్సాప్ ద్వారా పంపించాలన్నారు. ఆయా కార్యక్రమాల వలన విద్యార్థుల్లో మంచి ఆరోగ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు, లైఫ్‌స్కిల్స్, విలువలు, టీం వర్క్ వంటి అంశాలు మెరుగుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్ని డైట్ కళాశాల లెక్చర్లు డాక్టర్ కె ప్రసాద్, సౌజన్య కోఆర్డినేటర్లుగా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.